క్లుప్తంగా

తాగునీటికి కటకట



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం పలుగుల పంచాయతీ పరిధిలోని ఎస్సీకాలనీలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోరుకు సంబంధించి స్టార్టర్ రిపేర్‌కు రాగా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. దీంతో తాగునీటి కోసం ఇతర వార్డుల్లోకి వెళ్లి ఎడ్ల బండ్ల సాయంతో నీటిని తీసుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం



కాటారం : మండలంలోని దంతాలపల్లి క్రాస్ వద్ద స్కూల్ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. స్థానిక మాంటిస్సోరి పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను తీసుకు రావడానికి బుధవారం ఉదయం ప్రతాపగిరి వైపు వెళ్లింది. కొంతమంది విద్యార్థులతో తిరుగు ప్రయాణంలో దంతాలపల్లి వైపు వస్తు క్రాస్ చేస్తుండగా బస్సు స్టీరింగ్ ఫెయిల్ అయింది. రోడ్డు కిందకు దిగే క్రమంలో డ్రైవర్ అప్రమత్తమై సడెన్ బ్రే క్ వేసి బస్సును నిలిపి వేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. విద్యార్థులు సురక్షితంగా ఉండటంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక

ములుగు రూరల్ : ములుగు మండలంలోని కన్నాయిగూడెం, పంచోత్కులపల్లి, పెగడపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీల ఎన్నికను బుధవారం మహిళా కమిటీ మండల అధ్యక్షురాలు గుంటోజు పావని నిర్వహించారు. కన్నాయిగూడెం అధ్యక్షురాలిగా దుగ్గి కుష్బూ, పంచోత్కులపల్లి అధ్యక్షురాలిగా ఆగబోయిన విజయ, పెగడపల్లి అధ్యక్షురాలిగా తాటి కవితను నియమించడంతో పాటు పూర్తి కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలను, వడ్డీలేని రుణాలను ప్రజలకు వివరించాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో మహిళా అభ్యర్థులను గెలిపించుకునే విధంగా కృషి చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షురాలు రాధిక, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిగా మార్చాలి

ఏటూరునాగారం : ఏరియా ఆస్పత్రిగా మార్చి మెరుగైన వైద్యసేవలు అందించాలని, వంద పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. బుధవారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో సామాజిక వైద్యశాల సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు వైద్యం కోసం వస్తున్నారని, ఆస్పత్రిలో 30 పడకలే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 50 పడకలకు మంజూరు చేసినా భవనానికి నిధులు కేటాయించాలని చెప్పినప్పటికీ నేటికి పట్టించుకోవడం లేదని అన్నారు. అదేవిధంగా టీ హబ్‌లో పరికరాలు లేవని, బ్లడ్ బ్యాంక్ ఉన్నా ప్లేట్‌లెట్స్‌కి లైసెన్స్ లేకపోవడంతో ప్లేటలెట్స్ కోసం వేరే ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆస్పత్రిగా మార్చి 100 పడకలకు పెంచి మెరుగైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

అద్దె భవనాల్లో ఎందుకో?

- సొంత భవనాలు ఉన్నా నిరుపయోగమే..
- స్వల్ప మరమ్మతులతో వినియోగంలోకి..

టేకుమట్ల : మండల కేంద్రంలోని మహిళా గ్రామైక్య సంఘం, అంగన్‌వాడీ భవనాలను అద్దెకి తీసుకొని విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ వీరికి కేటాయించిన భవనాలను వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. మహిళా గ్రామైక్య సంఘానికి 2006లో నిధులు కేటాయించి భవనాన్ని నిర్మించారు. అయితే నూతన మండలంగా టేకుమట్ల ఆవిర్భావంతో స్థానిక పోలీస్ స్టేషన్ నిర్వహణకు 2017లో మహిళా గ్రామీణ సంఘం భవనాన్ని కేటాయించారు. దీంతో ఆ భవనం 2023 వరకు పోలీస్ స్టేషన్‌గా కొనసాగింది. 2023 నుంచి ఇప్పటివరకు మహిళా గ్రామైక్య సంఘం భవనాన్ని ఆధీనంలోకి తీసుకోకపోవడంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. మహిళా గ్రామైక్య సంఘం మండల కేంద్రంలోని ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని విధులు నిర్వహిస్తున్నారు.



నిరుపయోగంగా గ్రామైక్య సంఘ భవనం



పిచ్చిమొక్కలతో నిండిన అంగన్‌వాడీ భవనం

సొంత భవనం ఉన్నప్పటికీ అద్దె భవనంలో కొనసాగుతుడడంతో సంవత్సరానికి సుమారు రూ.50 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. సొంత భవనంలో కొంతమేర మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వస్తుందని పలువురు సూచిస్తున్నారు. సొంత భవనం ఉండగా అద్దె భవనంలో సంఘం విధులను కొనసాగించడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే గ్రామానికి సంఘం భవన సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్ర భవనం ఉండగా గతంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది వినియోగించుకున్నారు. పోలీస్ స్టేషన్ నూతన భవనంలోకి మారడంతో కొంతకాలం అంగన్‌వాడీని భవనంలోనే కొనసాగించారు. పెచ్చులు ఊడుతున్నాయనే కారణంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఖాళీ చేసి అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ భవనానికి స్వల్ప మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తుందని, అధికారులు పాలకులు స్పందించి భవన మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లు పూర్తి చేయాలి

జిల్లా సైన్స్ అధికారి స్వామి

కాటారం: ఇన్‌స్పైర్ అవార్డు మానక్ కాంపిటేషన్‌కు సంబంధించి ఈ నెల 10 లోపు అన్ని పాఠశాలల నుంచి సైన్స్ ప్రయోగాలకు నామినేషన్లు పూర్తి చేయాలని జిల్లా సైన్స్ అధికారి బి.స్వామి తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ అవార్డు మానక్ కాంపిటేషన్‌పై బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. నామినేషన్ కోసం జూన్ 15వ తేదీ నుంచి సెప్టెంబర్ 15 వరకు అవకాశం ఉండగా ఇప్పటి వరకు జిల్లాలో చాలా తక్కువ నామినేషన్లు నమోదైనట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ఇంటర్మీడియట్ కళాశాలలనుంచి నుంచి ఐదు నామినేషన్లు అప్‌లోడ్ చేయాలని సూచించారు. నామినేషన్ కోసం విద్యార్థుల అకౌంట్లు, రైటప్‌లను సిద్ధం చేసుకొని పూర్తి చేయాలని తెలిపారు. నామినేషన్ చేసిన ఐడియాలు సెలెక్ట్ అయితే రూ.పది వేలు అవార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవార్డు డబ్బులతో సైన్స్ ప్రాజెక్ట్ తయారు చేయడం ఖర్చు, రవాణా భత్యంగా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు సైన్స్ టీచర్లతో నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయించాలని తెలిపారు. సైన్స్ కార్యక్రమాల నిర్వహణలో జిల్లాను ముందంజలో ఉంచడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం నిర్మూలన, పర్యావరణ పరిరక్షణపై సైన్స్ ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, హెచ్‌ఎం సోమలింగం, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా జనరల్ సెక్రటరీ గండు రాజబాబు, బయోసైన్స్ ఫోరం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వామి

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలోని అంగన్‌వాడీ–2 భవన నిర్మాణానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇటీవల రూ.12లక్షలు మంజూరు చేశారు. బుధవారం పలుగుల యూపీఎస్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. పీఆర్ ఏఈ రవీందర్, పంచాయతీ సెక్రటరీ సమ్మయ్య, హెచ్‌ఎం మల్లేష్, అంగన్‌వాడీ టీచర్ ఒద్ది ఉమామహేశ్వరి, మాజీ సర్పంచ్ ఒద్ది చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ మానెం మహేష్, మచ్చ వెంకటేష్, సుగుణ, రాజయ్య, సమ్మయ్య, రవి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

కాటారం : మండలంలోని విలాసాగర్ మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ బుధవారం అతివేగం వల్ల అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో రోడ్డు పక్కన ఉన్న పంట పొలం ధ్వంసమైంది. ఇసుక ట్రాక్టర్లతో తమ పంట పొలాలు నాశనం అవుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని వారు కోరుతున్నారు.

మండల స్థాయి టీఎల్‌ఎంల ప్రదర్శన

మల్హర్ : మండలంలోని వల్లెకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) నిర్వహించారు. ఈ మేళాలో మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలోని 35 మంది ఉపాధ్యాయులు 209 కృత్యాలను ప్రదర్శించారు. ఇందులో 10 మంది టీచర్లు టీఎల్‌ఎం బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ప్రదర్శించారు. తెలుగు సబెక్టు నుంచి ఎ.స్వర్ణకుమారి, బి.కవిత, అరుణ్‌కుమార్, ఇంగ్లిష్ నుంచి బి.కవిత, డి.సంధ్యారాణి, గణితం నుంచి బి.పద్మ, ఎల్ రమేశ్ నాయక్, ఎ.మధులత, ఈవీఎస్ నుంచి రిబ్కా, శైలజ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వీటిని జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాకు పంపించారు. కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు సుదర్శనం, తిరుపతి, పీజీహెచ్‌ఎంలు తిరుపతి, నర్సింగరావు, రఘునందన్, గణేష్, మధుసూదన్, మహిపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈఓ తదితరులు

మహిళా కళాకారులకు బహుమతుల ప్రదానం

మొగుళ్లపల్లి : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మొట్లపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక గీతాలతో భజన కార్యక్రమాలు నిర్వహించిన మహిళా కళాకారులకు ఎస్సై బోరగల అశోక్ బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గణపతి నిమజ్జన సమయంలో డీజే పాటలతో కాకుండా శాంతియుత వాతావరణంలో గణపతి సంకీర్తనలకు ప్రాధాన్యతనిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటన తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలని తెలిపారు. అనంతరం ఎస్సైని గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపల్లి, మొట్లపల్లి కళాకారులతోపాటు. గణపతి నిర్వహణ కమిటీ చైర్మన్ ఆళ్ల మాధవరెడ్డి, సామల అన్నారెడ్డి, చిలుకూరి అమరేందర్‌రెడ్డి, డ్యాగ రమేష్, పూజారి కృష్ణమూర్తి, విగ్రహ దాత రాళ్లబండి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గజ్జి రాజకుమార్, ఆలయ చైర్మన్ గూడూరు రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై

వర్షాలతో 1,500 ఎకరాల్లో పంట నష్టం



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ సుప్రతిజ్యోతి

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలో కురిసిన భారీ వర్షాలతో ఎగువ నుంచి గోదావరికి వరద పోటెత్తింది. దీంతో ఇప్పటికే మూడు సార్లు గోదావరి పరివాహక ప్రాంతాల్లో పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఏఓ సుప్రతిజ్యోతి అన్నారం, చంద్రుపల్లి, పలుగుల తదితర గ్రామాల్లో పంటనష్టంపై సర్వే చేశారు. వ్యవసాయాధికారులు మహదేవపూర్ మండలంలో మొత్తం 1,500 ఎకరాల్లో పంట నష్టం అయినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. మొత్తం పత్తి 1,100 ఎకరాలు, వరి 4,00 ఎకరాల్లో పూర్తిగా నష్టపోయినట్లు అంచనా వేసి నివేదికలు ఉన్నతాధికారులకు పంపినట్లు ఏఓ పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

భూపాలపల్లిరూరల్ : పద్మశాలి ముద్దుబిడ్డ, తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడానికి బుధవారం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట పీసీసీమెంబర్ చల్లూరి మధు, కాంగ్రెస్ నాయకులు గూట్ల తిరుపతి, ఇప్పకాయల నర్సయ్య, విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ నాయకులు రాజేంద్ర ప్రసాద్, అంకం నర్సయ్య, అడ్డగట్ల శ్రీధర్, కుసుమ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో ఎమ్మెల్యే పూజలు

భూపాలపల్లి పట్టణంలోని ది కాకతీయ ఖని కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఎమ్మెల్యే పూజలు చేసి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయిగణేష్ వినాయక కమిటీ హనుమాన్‌నగర్, లక్ష్మీ నగర్ (జంగేడు రోడ్), సాయిగణేష్ ఉత్సవ కమిటీ ఎల్బీ నగర్, తదితర మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.

బావిలో పడి యువకుడి మృతి

చిట్యాల : మండలంలోని దూత్‌పల్లి గ్రామానికి చెందిన రాపాల ప్రశాంత్ (27) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. దూత్‌పల్లికి చెందిన ప్రశాంత్ పత్తి చేనులో ఉన్న తన తల్లిని కలిసేందుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో పక్కనే ఉన్న పాడుబడిన బావిలో కాలుజారి ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. దీంతో ప్రశాంత్ తల్లి శబ్దం విని వచ్చి చూడగా నీటిపై చెప్పులు కనబడగా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. గ్రామస్తులు తాళ్ల సాయంతో బయటకు తీయగా అప్పటికే ప్రశాంత్ మృతిచెందాడు. మృతుడి తల్లి ఐలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. కాగా మృతి చెందిన ప్రశాంత్ మృతదేహన్ని స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు కిష్టయ్య, శంకర్, మల్లేష్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.



ప్రశాంత్ మృతదేహం

దోమల మందు పిచికారీ

కన్నాయిగూడెం : మండలంలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టల గంగారంలో వైద్యసిబ్బంది దోమల మందు పిచికారీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలబారిన పడుతారని ముందస్తుగా గ్రామాల్లో రెండో దఫా దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు డాక్టర్ అభినవ్ తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద అన్నదానం



కాళేశ్వరం: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



రేగొండ(కొత్తపల్లిగోరి): ఎస్సై దివ్యను సన్మానిస్తున్న మహిళా కమిటీ సభ్యులు



చిట్యాలలో..



గణపురం: లక్ష్మారెడ్డిపల్లెలో అన్నదానం కార్యక్రమంలో భోజనం వడ్డిస్తున్న సీఐ, ఎస్సై

గణపురం : మండలంలో గణపతి మండపాల వద్ద బుధవారం అన్నదానం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. గుడివాడలో బీఆర్ఎస్ యువజన నాయకుడు గాజర్ల రాజు ఆధ్వర్యంలో, ఐబీ రోడ్డు వద్ద గణపతి నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మండలంలోని చెల్పూరు గ్రామంలో శ్రీనివాస వర్తక సంఘం ఆధ్వర్యంలో, లక్ష్మారెడ్డిపల్లెలో గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గణపురం సీఐ కరుణాకర్ రావు, ఎస్సై అశోక్ హాజరై భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఘనంగా కుంకమ పూజలు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల ఫ్రెండ్స్ గజానన గణపతి మండపం వద్ద బుధవారం మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

కాళేశ్వరం : కాళేశ్వరంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోంద్రవాడ వినాయకుడి వద్ద బుధవారం మల్లోజు రవీన–రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. కాళేశ్వరం గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి : గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆరెపల్లి హనుమాన్ దేవాలయం వద్ద బుధవారం అన్నదానం, పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

టేకుమట్ల : మండల కేంద్రంలోని క్రిష్ణ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద భక్తులకు కొలుగూరి రమేష్, అనిల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బుధవారం ఉదయం మండపంలో నిర్వహించిన కుంకుమ పూజలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రేగొండ(కొత్తపల్లిగోరి) : కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద బుధవారం మహా అన్నదానం ఏర్పాటు చేయగా, ఎస్సై దివ్య హాజరై ప్రారంభించారు. అనంతరం ఎస్సైని మహిళా కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఉత్సవ కమిటీ సభ్యులు చిరిపోతుల లక్ష్మి, బిళ్ల రజిత, రమ, జ్యోతి, వనమాల, భక్తులు పాల్గొన్నారు.

వర్తక సంఘం ఆధ్వర్యంలో..

చిట్యాల: మండల కేంద్రంలోని గణేష్ వర్తక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కుంకుమార్చన, అన్నదానం ఏర్పాటు చేశారు. కమిటి సభ్యులు, భక్తులు రాజేందర్, తాటిపల్లి శ్రీనివాస్, చింతకింది శ్రీనివాస్, వల్లాల ప్రవీణ్, మేడిపల్లి శ్రీనివాస్, క్యాతరాజు మల్లేష్, మైదం శ్రీకాంత్, ఉయ్యాల రమేష్, నాగరాజు పాల్గొన్నారు.



మల్హర్: వినాయకుడి వద్ద కుంకమ పూజలు చేస్తున్న మహిళలు



టేకుమట్లలో..



మొగుళ్లపల్లిలో..

యూరియా కోసం రైతుల తిప్పలు



టేకుమట్ల: పోలీసు పహారా మధ్య యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు



చిట్యాల: క్యూలో నిల్చున్న రైతులు

రేగొండ : కొత్తపల్లిగోరి మండలానికి చెందిన రైతులు యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. ఒకటి, రెండు బస్తాల కోసం సొసైటీల వద్ద గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. మండల కేంద్రంలోని సొసైటీకి బుధవారం ఉదయం 444 బస్తాల యూరియా రాగా, పంపిణీ చేస్తారని తెలుసుకున్న రైతులు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఉదయం నుంచే రైతులు బారులుదీరారు. కాగా రైతులు తెల్లవారుజామునే వివిధ గ్రామాల నుంచి రావడంతో టిఫిన్ బాక్సులు తీసుకుని వచ్చి అవస్థలు పడుతున్నారు. యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ సారయ్య తెలిపారు.

బందోబస్తు మధ్య యూరియా పంపిణీ

టేకుమట్ల : యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. బుధవారం ఉదయం మండల కేంద్రంలోని ఆగ్రోస్–1లో యూరియా కోసం మహిళలు, పురుషులు క్యూలో నిల్చున్నారు. 400 యూరియా బస్తాలు రాగా వందల సంఖ్యలో రైతులు క్యూలో నిల్చున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కళ్యాణి ఒక్కో రైతుకు ఒక బస్తాను అందించేలా చర్యలు తీసుకున్నారు. ఒక్కసారిగా రైతులు షాపు వద్దకు చేరుకోవడంతో కాసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పోలీస్ పహారాలో బస్తాలు అమ్మకం

చిట్యాల : మండల కేంద్రంలోని ఓడీఎంఎస్ షాపు ఎదుట యూరియా బస్తాల కోసం బుధవారం రైతులు అరిగోస పడ్డారు. పోలీసు పహారాలో రైతులకు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాలతో యూరియా బస్తాలు పంపిణీ చేశారు. నాలుగైదు ఎకరాల ఉన్న రైతులకు ఒకే బస్తా ఇవ్వడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు బస్తాలు దొరకక పోవడంతో వెనుదిగిరారు.



రేగొండ: గోదాం వద్ద భోజనం చేస్తున్న రైతు

వెల్లివిరిసిన మతసామరస్యం

చిట్యాల : మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని స్టార్ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం వినాయక మండపంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రాజ్‌మహ్మద్‌తో పాటు కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు. దీంతో మతసామరస్యం సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తోందని ఆయన తెలిపారు. కమిటీ సభ్యులు మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎండీ రాజ్‌మహ్మద్, యూత్ సభ్యులు